ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



వికారాబాద్ - మేడ్చల్

జిల్లాల వార్తలు

5

ఆదివారం 25 ఆగస్టు 2024

వేంకటేశ్వరుడికి లక్ష తులసి అర్చన



పేదల తిరుపతిగా పేరొందిన కొడంగల్ శ్రీ మహాలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం లక్ష తులసి అర్చన కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. శ్రావణమాసం మూడో శనివారం సందర్భంగా లక్షనామాలతో శ్రీ వారికి లక్ష తులసి దళాలతో అర్చనను వైభవంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

- కొడంగల్, ఆగస్టు 24

పచ్చందాలు



చుట్టూ ఎత్తయిన కొండలు.. వాటి కింద పచ్చదనం పరుచుకొన్న పంట పొలాలు..దానిపై నీలి రంగులో ఉన్న ఆకాశంలో మెరిసిపోతున్న వెండి మబ్బులు..చిత్రకారుడి కుంచె నుంచి జాలువారినట్లు కనువిందు చేస్తున్న ఈ దృశ్యం బషీరాబాద్ మండలం మైల్వార్ శివారు అక్కలమ్మ చెరువు సమీపంలోని పంట పొలాలు. వర్షాలు సమృద్ధిగా కురువడంతో ఎటూ చూసినా పచ్చదనం కనువిందు చేస్తోంది. లేత వరిపైరుతో భూమిపైన ఆకుపచ్చని తివాచీ పరిచినట్లు కనిపిస్తోంది. చెరువు కింద రైతులు వరినాట్లు వేయగా, పైరు ఏపుగా పెరిగి కనువిందు చేస్తోంది.

- బషీరాబాద్



కళ్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేస్తున్న స్పీకర్‌ప్రసాద్‌కుమార్

ఎన్నికల్లో ఇచ్చిన ప్రతీ హామీని

అమలు చేస్తాం

స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

మోమిన్‌పేట్/వికారాబాద్, ఆగస్టు 24: ఎన్నికల్లో ఇచ్చిన ప్రతీ హామీని కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తుందని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. శనివారం మోమిన్‌పేట్ మండల కేంద్రంలోని రైతు వేదికలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్, సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 31 మందికి కల్యాణ లక్ష్మి, షాదీముబారక్, 45 మందికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. త్వరలోనే ఇచ్చిన హామీ మేరకు కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారులకు లక్ష రూపాయలతో పాటు తులం బంగారం అందించడం జరుగుతుందని తెలిపారు. నియోజకవర్గంలోని నందివాగు ప్రాజెక్టు, కొమిశెట్టిపల్లి ప్రాజెక్టు, కోట్‌పల్లి ప్రాజెక్టు, సర్పన్‌పల్లి ప్రాజెక్టులకు అత్యధిక నిధులు కేటాయించి మరింత అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మనోహరచక్రవర్తి, డిప్యూటీ తహసీల్దార్ సురేశ్, మన్నె శంకర్‌యాదవ్,నరోత్తంరెడ్డి, సుభాష్‌గౌడ్, మానయ్య, మహేందర్‌రెడ్డి, వేమారెడ్డి, ప్రతాప్‌రెడ్డి, పాల్గొన్నారు. అంతేకాకుండా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులతో పాటు షాదీముబారక్, కళ్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం పనిచేస్తుందని స్పష్టం చేశారు.

నూతన రెవెన్యూ చట్టంలో అందరూ భాగస్వాములు కావాలి

సలహాలు, సూచనలు ఇవ్వాలి: కలెక్టర్ గౌతమ్



మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్


మేడ్చల్ ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రవేశపెడుతున్న నూతన ఆర్‌ఓఆర్ చట్టం ముసాయిదా బిల్లుపై సలహాలు, సూచనలు అందజేయాలని కలెక్టర్ గౌతమ్ పేర్కొన్నారు. నూతన రెవెన్యూ చట్టం-2024 బిల్లుపై శనివారం కలెక్టరేట్‌లో రెవెన్యూ అధికారులు, న్యాయవాదులు, రైతులు, యువకులు, నిపుణులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ భూ సమస్యల పరిష్కారానికి నూతన రెవెన్యూ చట్టం రూపొందించేందుకు ప్రభుత్వం సంకల్పించిందన్నారు. పలువురు న్యాయవాదులు, మాజీ జడ్జీలు, రెవెన్యూ అధికారులు, రైతులు, ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ పలు సూచనలు, సలహాలు చేశారు. పాత చట్టాలని మార్చి కొత్త చట్టాలలో ప్రతి సంవత్సరం పహాణిలో నమోదు చేయడంతో పాటు భూమి శిస్తు కూడా కట్టే విధంగా ఉండాలన్నారు. ఆర్‌ఓఆర్‌ను సవరించాలని, పొజిషన్ కాలం ఉండాలని, కబ్జా ఉన్న రైతులకు పట్టా ఇవ్వాలని కోరారు. కలెక్టర్ స్థాయిలోనే సమస్యలు పరిష్కరించే విధంగా చూడాలని, రైతులు కార్యాలయాల చుట్టూ తిరుగలేకపోతున్నారని వివరించారు. తప్పులు సవరించే అవకాశం కల్పించాలని మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి కోరారు. అందరి సూచనలు, సలహాలు ప్రభుత్వానికి నివేదిస్తామని అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి తెలిపారు. సమావేశంలో డీఆర్‌ఓ హరిప్రియ, సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి, తోటకూర వజ్రేష్‌యాదవ్, తహసీల్దార్లు పాల్గొన్నారు.

కల్లు.. గొల్లు!

ప్రాణాలను హరిస్తున్న కల్తీ కల్లు

- మూడేళ్లక్రితం ఎర్రవల్లి, మమ్మదాన్‌పల్లి, నారాయణపూర్ గ్రామాల్లో 200 మందికి పైగా అస్వస్థత
- తాజాగా పీరంపల్లిలో కల్తీ కల్లు కాటు
- ఒకరు మృతి, నలుగురికి కిడ్నీలపై ప్రభావం..
- ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న బాధితులు
- జిల్లాలో అనుమతులు లేని కల్లు దుకాణాలే ఎక్కువ
- గ్రామాల్లో విచ్చలవిడిగా విక్రయాలు...
- రూ. కోట్లలో కల్తీకల్లు వ్యాపారం..
- మామూళ్ల మత్తులో ఎక్సైజ్ అధికారులు

సహజసిద్ధమైన తాటి, ఈత చెట్ల నుంచి తీసే స్వచ్ఛమైన కల్లుకు బదులుగా నిషేధిత మత్తు పదార్థాలతో తయారు చేసిన కల్తీ కల్లు కష్టజీవులను కాటేస్తోంది. ఏళ్ల తరబడి కృత్రిమ కల్లు తాగుతున్న వారంతా ఎముకలు గూడులా, జీవచ్ఛవంలా తయారవుతున్నారు. క్లోరోఫాం, అల్ఫాజోలం.. డైజోఫాం.. ఇప్పుడు జిల్లాలో చాలామందిని వణికిస్తున్న డ్రగ్ ఇది.. మామూలు మనుషులను కూడా సైకోలుగా మార్చే శక్తి దీనికుంది. ఇప్పుడు వందలాది కుటుంబాలకు శాపంగా మారింది. మనుషులను నిద్రపుచ్చడానికి తాగే ఈ కల్తీకల్లు ఇప్పుడు ఎన్నో జీవితాలను నాశనం చేస్తోంది. కృత్రిమ కల్లు తయారు చేస్తూ అక్రమ వ్యాపారం నిర్వహిస్తున్న మాఫియాల పాపం ఇది. ఇటీవల జిల్లాలో జరిగిన ఘటనలే ఇందుకు సాక్ష్యం.



వికారాబాద్, ఆగస్టు 24 : ప్రజల శారీరక శ్రమను తీర్చాల్సిన కల్లు కలుషితమై ప్రజల ప్రాణాలను హరిస్తోంది. అంతే కాకుండా శరీరంలోని అవయవాలను దెబ్బతీస్తూ లోలోపల కోలుకోలేని విధంగా దెబ్బతీస్తోంది. కూలీనాలి చేసుకుని కుటుంబం వెళ్లదీసుకునే పేదలు ఆసుపత్రుల పాలయ్యేలా చేసి ఆర్థికంగా మరింత చితికిపోయేలా చేస్తోంది. ఇందుకు కల్లు వ్యాపారుల అత్యాశ ఒక కారణమైతే... మరోవైపు కాసులకు అలవాటు పడ్డ ఎక్సైజ్ శాఖ మరో కారణం. వికారాబాద్ మండల పరిధిలో గతంలో ఎర్రవల్లి, నారాయణపూర్, నవాబుపేట పరిధిలోని మమ్మదాన్‌పల్లి, చిట్టిగిద్ద తదితర గ్రామాల్లో కల్తీ కల్లు బారిన పడి ఎంతో ఆసుపత్రుల పాలయ్యారు. తాజాగా వికారాబాద్ మండలం పీరంపల్లి గ్రామంలో కల్తీ కల్లు తాగి పలువురు ఆసుపత్రుల పాలైన విషయం ఆ గ్రామస్తులను భయాందోళనకు గురి చేస్తోంది. కలుషిత కల్లు తాగి దుర్గయ్య అనే వ్యక్తి మృతి చెందగా, మరో నలుగురి కిడ్నీలపై తీవ్ర ప్రభావం చూపింది. అంతేకాకుండా ఎంతో మంది ఆసుపత్రుల పాలయ్యారు.

కొన్నింటికే అనుమతులు

వికారాబాద్ జిల్లా పరిధిలో టీఎఫ్‌టీలు 341 , టీసీఎస్‌లు 57 ఉండగా, 2246 మంది లైసెన్స్ హోల్డర్లు ఉన్నారు. కాగా, జిల్లాలో నిబంధనలకు విరుద్ధంగా కల్లు దుకాణాలు కొనసాగుతున్నాయి. ఒక గ్రామంలో ఒకటి లేదా రెండు కల్లు దుకాణాలకు అనుమతులు ఉండగా అనుమతులు లేకుండా మరికొన్ని కొనసాగుతున్నాయి. రాష్ట్రంలో పుట్టుక నుంచి చావు వరకు అనేక సందర్భాల్లో గ్రామీణ ప్రాంతాల్లో కల్లు భాగంగా మారింది. పేదల బలహీనతను ఆసరాగా చేసుకున్న కల్లు వ్యాపారులు తమ ఇష్టానుసారంగా కల్లు దుకాణాలు తెరిపిస్తున్నారు. విచ్చలవిడిగా కల్లు విక్రయాలు జరిగేలా చేస్తున్నారు. జిల్లాలో సుమారు 400 వరకు కల్లు దుకాణాలు అనుమతులు లేకుండానే కొనసాగుతున్నాయంటే ఎక్సైజ్ శాఖ పనితీరు ఏ విధంగా ఉందనేది స్పష్టమవుతోంది.

కల్తీ కాదంటున్న ఎక్సైజ్ అధికారులు

ఇదిలా ఉంటే, ల్యాబ్ నుంచి ఇప్పటి వరకు ఎలాంటి నివేదికలు రాక ముందే కల్తీకల్లు కాదని ఎక్సైజ్ అధికారులు తేల్చేయడం చర్చనీయాంశంగా మారింది. అనుమతి లేకుండా కల్లు వ్యాపారం కొనసాగుతున్నదని, కల్లుకారణంగా ఓ వ్యక్తి ప్రాణాలు కోల్పోవడమే కాకుండా ఎంతో మంది ఆసుపత్రుల పాలయ్యారనేది పక్కన పెట్టేసి... సీజనల్ వ్యాధుల వల్లనే పీరంపల్లిలో పలువురు అస్వస్థతకు గురైనట్లుగా విలేకరుల సమావేశంలో అధికారులు ప్రకటించడం విమర్శలకు దారి తీస్తోంది. పీరంపల్లి గ్రామంలో ఐదు రోజులుగా వైద్య శిబిరం నిర్వహిస్తుండగా, గురువారం గ్రామంలో పర్యటించిన జిల్లా వైద్యాధికారి ముందు కల్తీకల్లు బారిన పడిన వారు కోలుకుంటున్నారని ప్రకటించి, ఆ తరువాత సీజనల్ వ్యాధులతో అని చెప్పడం కూడా ఎన్నో అనుమానాలకు తావిస్తోంది. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడే విధంగా అధికార యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదనేది అంతుపట్టని పరిస్థితి నెలకొంది. పీరంపల్లిలో కల్లు తాగి పలువురు అస్వస్థతకు గురైన ఉదంతంలో సంబంధిత శాఖల అధికారుల తీరు పట్ల పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

పర్యటించిన అధికారులు

ఇప్పటికే ఎంపీడీవో బృందం గ్రామంలో పర్యటించి నీటి పరీక్షలు చేసి గ్రామంలో తాగు నీరు కలుషితం కాలేదని, తాగునీటి పరంగా ఏ సమస్య లేదని స్పష్టం చేసింది. ఒకవైపు గ్రామంలో ప్రజలు అస్వస్థతకు గురవడానికి నీటి సమస్య కారణం కాదని మండల పరిషత్ అధికారులు... మరో వైపు కల్తీ కల్లు కాదని ఎక్సైజ్ అధికారులు పేర్కొనడం గమనార్హం.

పీరంపల్లి ఒకరు మృతి



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కల్తీకల్లు బాధితుడు

రాఖీ పండుగ రోజు ఇళ్లకు వచ్చే చుట్టాలతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. సాయంత్రం సమయంలో సంతోషంతో ప్రజలు కల్లు తాగారు. రోజుమాదిరి కంటే ఎక్కువ కల్లు గ్రామంలోకి రాగా రోజూ కల్లు తాగే వారితో పాటు పండుగకు తమ ఇళ్లకు వచ్చిన అక్కాచెల్లెళ్లు, బంధువులు సైతం కల్లు తాగారు. పండుగ మరుసటి రోజు నుంచే ఒక్కొక్కరుగా ఆసుపత్రుల్లో చేరుతూ వచ్చారు. ఇప్పటి వరకు సుమారు 60 మంది వరకు ఆయా ఆసుపత్రుల్లో చికిత్స పొందుతుండగా, వారిలో దుర్గయ్య(57) అనే వ్యక్తి మూడు రోజుల కిందట మృతి చెందాడు. ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న మరో నలుగురి కిడ్నీలపై ప్రభావం చూపినట్లుగా తెలుస్తోంది. మిగతా వారు ఇంకా ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు.

నీరు కలుషితం కాకుండా, కల్లు కల్తీ కాకుండా 60 మంది వరకు ఆసుపత్రుల పాలవడానికి దారితీసిన కారణాలపై జిల్లా ఉన్నతాధికారులు దృష్టి సారించకపోవడం గమనార్హం.

కోట్ల వ్యాపారానికి.. ఎక్సైజ్ అధికారుల గులాంగిరి



గ్రామంలో పర్యటించిన అధికారులు (ఫైల్)

జిల్లాలో కల్లు వ్యాపారం వ్యాపారులకు కాసులు కురిపిస్తోంది. అయితే టీఎఫ్‌టీ పరిధి అయినా, టీసీఎస్ పరిధి అయినా ఎక్కడ ఉండే కల్లు అక్కడే విక్రయించాలనేది నిబంధన. అయితే జిల్లాలో ఒక ప్రాంతంలోని కల్లును అక్కడే విక్రయించిన సందర్భాలు లేవు. కల్లు డిపోలు ఏర్పాటు చేసి ఆయా గ్రామాలకు రోడ్డుమార్గం ద్వారా కల్లు తరలిస్తున్నారు. మూడేళ్ల కిందట నవాబుపేట చిట్టిగిద్ద వద్ద ఉన్న డిపో నుంచి సరఫరా చేసిన కల్లు వల్లనే పరిసరాల్లోని పలు గ్రామాల ప్రజలు అవస్థలు పడ్డారు. తాజాగా పీరంపల్లిలో కల్తీ కల్లు తాగి 60 మంది వరకు అస్వస్థతకు గురైన సంఘటన తెలిసిందే. ఆ గ్రామంలో కల్లు వ్యాపారం చేసేందుకు అనుమతులు లేవు. అక్కడ విక్రయించే వ్యాపారి ఎక్కడో తయారు చేసుకుని వచ్చి గ్రామంలో కల్లు విక్రయిస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. గత కొన్నేళ్లుగా అక్కడ కల్లు విక్రయిస్తున్నా ఎక్సైజ్ శాఖ అధికారులు మాత్రం ఆటు వైపు కన్నెత్తి చూడకపోవడం గమనార్హం.

జోరుగా అక్రమ నిర్మాణాలు

ప్రభుత్వ ఆదాయానికి గండి.. పట్టించుకోని అధికారులు



కరీంగూడ రోడ్డులో అక్రమ నిర్మాణాలు

కీసర, ఆగస్టు 24: సర్పంచ్‌లు, ఎంపీపీలు, ఎంపీటీసీల పదవి కాలం ముగియడంతో గ్రామాల్లో అధికారులు ఆడిందే ఆట...పాడిందే పాట అన్న చందంగా మారింది. గ్రామాలల్లో అక్రమ నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. పంచాయతీ కార్యాలయాల్లో బిల్ కలెక్టర్లు, పంచాయతీ కార్యదర్శులు అక్రమార్కులు ఇచ్చే మాముళ్లను వాటాలు పంచుకుంటుండంతో ప్రభుత్వాదాయానికి భారీ ఎత్తున్న గండిపడుతోంది. ఇంతతతంగం జరుగుతున్నా ఉన్నత అధికారులు మాత్రం అక్రమ నిర్మాణాలపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. కీసర మండల పరిధిలో యాద్గార్‌పల్లి, కరీంగూడ గ్రామాల్లో ప్రజాప్రతినిధులు ఎవ్వరు లేకపోవడంతో అక్రమ నిర్మాణాలను ప్రోత్సహిస్తు, పంచాయతీ కార్యదర్శులు, బిల్ కలెక్టర్ల సహాయంతో అందినకాడికి దోచుకతింటున్నారు. అక్రమ నిర్మాణాలను అరికట్టాల్సిన అధికారులే ఆజ్యం పోస్తుంటే, ఇంకా మేము ఎవరికి ఫిర్యాదు చేయాలని గ్రామస్థులు వాపోతున్నారు. గ్రామాలల్లో పర్యవేక్షణ చేయాల్సిన ఎంపీవో పత్తాలేకుండా పోయాడు. అసలు అ అధికారి ఉన్నాడో లేడో కూడా గ్రామస్థులకు తెలియని పరిస్థితి. ఎప్పుడు ఫోన్ చేసినా కలెక్టరేట్‌లో ఉన్నాము, ఉన్నత అధికారులతో సమావేశంలో ఉన్నాం.. అని సమాధానాలే తప్పా, గ్రామాల్లో అధికారులు ఎప్పుడు ఉంటారో కూడా తెలియని పరిస్థితి నెలకొంది. సర్పంచ్‌ల పదవి కాలం ముగియడంతో గ్రామాల్లో ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతోంది. ఇదేఅదునుగా గ్రామాలల్లో జోరుగా అక్రమ నిర్మాణాలు జరుగుతున్నా ప్రత్యేక అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. ఇటీవల ఔటర్ చుట్టు ఉన్న గ్రామాలు మున్సిపాలిటీలుగా మారాతాయాని, జీహెచ్ఎంసీలో వీలినం అవుతాయనే ప్రచారం కొనసాగడంతో పంచాయతీ కార్యదర్శులు, బిల్ కలెక్టర్ల కుమ్మక్కై, అక్రమ నిర్మాణాలను ప్రోత్సహిస్తున్నారు. వెంటనే నిర్మాణాలు చేసుకోండి.. మున్సిపల్‌గా మారే ముందు ఇంటి నంబర్లు కూడా కేటాయిస్తామంటూ అక్రమ నిర్మాణదారులతో రేటు మాట్లాడుకొని పంచాయతీ కార్యదర్శులు లక్షలు గడిస్తున్నారు. దీంతో రాత్రిబంవళ్లు అనే తేడా లేకుండా అక్రమ నిర్మాణాలు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. ఉన్నత అధికారులు ఎప్పటికప్పుడు గ్రామాల్లో పర్యటించి, అక్రమనిర్మాణాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.



యాద్గార్‌పల్లిలో అక్రమ నిర్మాణం

ప్రజా సమస్యల పరిష్కారం దిశగా అధికారులు కృషి చేయాలి

ముఖ్యమంత్రి కార్యదర్శి మాణిక్‌రాజ్



సమావేశంలో మాట్లాడుతున్న మాణిక్‌రాజ్

కొడంగల్, ఆగస్టు 24: ప్రజాసమస్యలు పరిష్కరించే దిశగా అధికారులు కృషి చేయాలని ముఖ్యమంత్రి కార్యదర్శి కె.మాణిక్‌రాజ్ తెలిపారు. శనివారం కొడంగల్‌లోని కడా కార్యాలయంలో నియోజకవర్గ ప్రజల నుంచి 874 వివిధ అంశాలపై వచ్చిన దరఖాస్తులపై శాఖల వారీగా వికారాబాద్, నారాయణపేట జిల్లాల కలెక్టర్లు ప్రతీక్‌జైన్, సిక్తా పట్నాయక్‌లతో కలిసి మాణిక్‌రాజ్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించేందుకు అధికారులు ప్రాధాన్యత కల్పించాలన్నారు. అధికారులు ఎప్పటికప్పుడు సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సూచించారు. ఉద్యోగుల విధానంలో మార్పులు రావాలని, జిల్లా అధికారులు వారంలో కనీసం మూడు రోజులు తప్పనిసరిగా క్షేత్రస్థాయిలో పర్యవేక్షించి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని తెలిపారు. ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలను గుర్తించి సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలని తెలిపారు. ఆర్‌అండ్‌బీ, రవాణా, పోలీసు శాఖ అధికారులు సమన్వయంతో పని చేసి ప్రమాదాలు జరిగే బ్లాక్ స్పాట్‌లను గుర్తించి ప్రమాదాలను నివారించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. సెప్టెంబరు 30వ తేదిలోపు విద్యుత్ సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా విద్యుత్ సరఫరా చేయాలని సూచించారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల నిమిత్తం వచ్చిన దరఖాస్తులను పరిశీలించి సమకూర్చే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈనెల 27న కడా కార్యాలయంలో గ్రీవెన్స్ రిపోర్టులను తెలుసుకునేందుకు గ్రీవెన్స్ యాప్‌లో దరఖాస్తులను ఎలా అప్‌లోడ్ చేయాలనే దానిపై శిక్షణ ఇవ్వడం జరుగుతుందని ముఖ్యమంత్రి కార్యదర్శి తెలిపారు. ఈయాప్ ద్వారా సమస్య స్థితిగతులు, సమస్యల పరిష్కారం అయ్యిందా లేదా తెలుసుకోవచ్చన్నారు. సమీక్షా సమావేశంలో ఎస్పీలు నారాయణరెడ్డి, యోగేశ్ గౌతం, అదనపు కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్, అసిస్టెంట్ కలెక్టర్లు ఉమాహారతి, గరిమన రుల, కడా ప్రత్యేకాధికారి వెంకటరెడ్డి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయిలో పట్నం ఆర్టీసీ డిపోకు రెండో బహుమతి

ఇబ్రహీంపట్నం, ఆగస్టు 24 : టీజీఆర్టీసీ రాష్ట్రస్థాయి ప్రగతి చక్రాల పురస్కారాల్లో ఇబ్రహీంపట్నం డిపో రెండో బహుమతి సాధించింది. శనివారం నగరంలోని ఆర్టీసీ కళా భవన్‌లో జరిగిన ఈ పురస్కారాల ప్రదానోత్సవంలో రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఎండీ సజ్జన్నార్ చేతుల మీదుగా డిపో మేనేజర్ వెంకట నర్సప్ప రూ.2.5లక్షల చెక్కును, పురస్కారాన్ని అందుకున్నారు. ఇబ్రహీంపట్నం డిపో ఉద్యోగులు కృషితోనే ఈ పురస్కారం లభించినట్లు డీఎం తెలిపారు. గతేడాది ఈ డిపో మూడో బహుమతి(2లక్షల రూపాయల పోత్సాహకం) సాధించింది. కార్యక్రమంలో గ్రేటర్ హైదరాబాద్ జోన్ ఈడీ వెంకటేశ్వర్లు, ఆర్ఎం వరప్రసాద్, డిప్యూటీ ఆర్ఎంలు సుచరిత, జగన్ పాల్గొన్నారు.



మంత్రి, ఎండీల నుంచి పురస్కారం అందుకుంటున్న డీఎం వెంకటనర్సప్ప

మాద ప్రసాద్‌కు డాక్టరేట్

మెయినాబాద్ రూరల్, ఆగస్టు 24 : హిమాయత్‌నగర్‌లోని చైతన్య డీమ్డ్ యూనివర్సిటీలో పీహెచ్‌డీ పూర్తిచేసిన పటాన్‌చెరుకు చెందిన మాద ప్రసాద్‌కు డాక్టరేట్ ప్రదానం చేశారు. డీమ్డ్ యూనివర్సిటీలో ప్రసాద్ కంప్యూటర్స్ సైన్స్‌లో 'స్టడీ ఆఫ్ ఎన్హాన్స్‌డ్ అట్రిబ్యూట్ బేస్డ్ ఎన్క్రిప్షన్' అనే అంశంపై జగదీశ్వర్ పర్యవేక్షణలో పరిశోధన చేశారు. యూనివర్సిటీ వీసీ పురుషోత్తంరెడ్డి శనివారం వర్సిటీలో ప్రసాద్‌ను అభినందించారు. కార్యక్రమంలో వర్సిటీ చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ సాత్వికరెడ్డి, ప్రొఫెసర్లు క్రిస్టోఫర్, రవీందర్, సుందర్ రామ్, జగదీశ్వర్, పబ్లిక్ రిలేషన్ అధికారి రాంబాబు, విద్యార్థులు పాల్గొన్నారు.



ప్రసాద్‌కు డాక్టరేట్ ప్రదానం చేస్తున్న యూనివర్సిటీ చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ సాత్వికరెడ్డి



ఓరియెంటేషన్ డే కార్యక్రమంలో మాట్లాడుతూన్న ఎమ్మెల్యే రాజేశ్వర్‌రెడ్డి

మంచి భవిష్యత్తుకు నిర్ణయాలు తీసుకోవాలి

మొయినాబాద్ రూరల్, ఆగస్టు 24: ఇంజినీరింగ్ మొదటిదశలోనే విద్యార్థులు తమ మంచి భవిష్యత్తుకు పునాదులు వేసుకునేలా మంచి నిర్ణయాలు తీసుకుని ఆచరిస్తే లక్ష్యాలకు చేరతారని విద్యాజ్యోతి ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. అజీజ్‌నగర్ చౌరస్తాలోని విద్యాజ్యోతి ఇంజినీరింగ్ కాలేజీలో నూతన విద్యార్థులకు శనివారం నిర్వహించిన ఓరియెంటేషన్ డే కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఇంజినీరింగ్ విద్య అంటే కేవలం గొప్ప కోసం కాదని, అందుకు అనుగుణంగా పరిశోధనలతో ఆవిష్కరణలపై దృష్టిపెట్టాలన్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు తమ కళాశాలతో నైపుణ్య విద్యను అందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో అధ్యాపక బృందం, ఏవో వెంకటాచలం, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యార్థులు దేశాభివృద్ధికి బాటలు వేయాలి



మాట్లాడుతున్న జేఎన్‌టీయూహెచ్ జీకే.విశ్వనాథ్

ఆదిభట్ల, ఆగస్టు 24: విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన జీవనాన్ని అలవర్చుకోవాలని జేఎన్‌టీయూహెచ్, యూజీసీ డాక్టర్ జీకే విశ్వనాథ్ అన్నారు. బొంగ్లూర్ పరిధి విశ్వేశ్వరయ్య ఇంజినీరింగ్ కాలేజీలో శనివారం నిర్వహించిన ఓరియెంటేషన్ డే కార్యక్రమానికి అతిథిగా వచ్చి మాట్లాడారు. విద్యార్థి దిశ నుంచే క్రమశిక్షణతో మెలగాలన్నారు. లక్ష్యాలను సాధించాలంటే కఠోర సాధన చేయాలన్నారు. విద్యార్థులకు అన్ని వసతులు కల్పించి ఉత్తమ విద్యను అందిస్తున్నారని యాజమాన్యాన్ని అభినందించారు. కళాశాల చైర్మన్ డాక్టర్ కస్నా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ తమ కళాశాల 20ఏళ్ల ప్రస్థానంలో ఉత్తమ ఫలితాలు సాధించిందని అన్నారు. న్యాక్ 'ఏ' గ్రేడ్ అటనమస్ హోదా పొందిందన్నారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో శ్రీనాథ్‌చారి, సెక్రెటరీ శ్రీధర్‌రెడ్డి, కన్నయ్య శెట్టి, రాములు,ప్రిన్సిపల్ రమేష్, అధ్యాపకులు,విద్యార్థులు పాల్గొన్నారు.

లక్ష్యం కోసం శ్రమిస్తేనే ఫలితాలు

ఇబ్రహీంపట్నం, ఆగస్టు 24 : విద్యార్థులు ఎంచుకున్న లక్ష్యంకోసం శ్రమించినప్పుడే మంచి ఫలితాలు వస్తాయని జేఎన్‌టీయూ(హైదరాబాద్) రిజిస్ట్రార్ కె.వెంకటేశ్వర్‌రావు అన్నారు. తల్లిదండ్రులు విద్యార్థులను ఎన్నో ఆశలతో ఉన్నత చదువులకు పంపుతున్నారని. వారి కలలను నిజం చేసే బాధ్యత పిల్లలదేనన్నారు. ఇబ్రహీంపట్నంలోని గురునానక్ విద్యా సంస్థల్లో బీటెక్ కోర్సుల్లో అడ్మిషన్ పొందిన విద్యార్థులు, తల్లిదండ్రులతో శనివారం జరిగిన ఓరియంటేషన్ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అంకిత భావం, క్రమశిక్షణతో ఏదైనా సాధించవచ్చన్నారు. పరిశ్రమలు, ఐటీ సంస్థలకు అవసరమైన కమ్యూనికేషన్ స్కిల్స్‌ను పెంచుకోవాలని విద్యార్థులకు సలహా చేశారు. కార్యక్రమంలో డీఆర్డీఎల్ రిటైర్డ్ శాస్త్రవేత్త అశ్వినీకుమార్ సంగాంకర్, గురునానక్ విద్యా సంస్థల వైస్ చైర్మన్ గగన్‌దీప్ సింగ్ కోహ్లీ, ఎండీ డా.హెచ్.ఎస్.సైనీ, డైరెక్టర్ డా.ఎస్ శ్రీనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు..


మాట్లాడుతున్న జేఎన్‌టీయూ రిజిస్ట్రార్ వెంకటేశ్వర్‌రావు

సాంకేతిక రంగాల్లో పట్టు సాధించాలి

మొయినాబాద్, ఆగస్టు 24: మారుతున్న కాలనికి అనుగుణంగా ఇంజినీరింగ్ విద్యార్థులు సాంతికేక పరిజ్ఞానాన్ని పెంపొందించుకొని సమాజ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఇన్ఫ్‌సెప్ట్రాన్ ఆటోమిషన్ కో ఫౌండర్ సీఈవో వెంకటసుబ్రహ్మణ్యం, ఫోనిక్ టర్నల్ జనరల్ మేనేజర్ గుణేశ్ తెలిపారు. మండల పరిధి కేజీరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం 13వ గ్రాడ్యుఏషన్ డేను నిర్వహించారు. విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేశారు. అనంతరం మాట్లాడుతూ.. సాంతికేకరంగాల్లో మరింత ప్రతిభ చాటాలన్నారు. తల్లిదండ్రులకు గౌరవం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో డీన్ మంతెన నర్సయ్య, డైరెక్టర్లు రోహిత్, ప్రశాంత్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థినికి సర్టిఫికెట్ అందజేస్తున్న సీఈవో

వేంకటేశ్వరస్వామి ఆలయం కిటకిట


లక్ష్మీవేంకటేశ్వరాలయంలో సత్యనారాయణస్వామి వ్రతాలు

చేవెళ్ల, ఆగస్టు 24: శ్రావణ శనివారం సందర్భాన్ని పురస్కరించుకొని చేవెళ్లలోని లక్ష్మీవేంకటేశ్వరాలయం భక్తులతో కిటకిటలాడింది. భక్తులు ఆలయంలో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలను నిర్వహించారు. సాయంత్రం వరకు ఆలయాన్ని పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించారు. అర్చకులు భక్తులందరికీ తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఫౌండర్ ట్రస్టీ వామనాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినికి 'ఎక్సలెన్స్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్'లో స్థానం

ఆమనగల్లు, ఆగస్టు 24 : ఆమనగల్లుకు చెందిన గంజి శ్రీవైష్ణవి అనే విద్యార్థినికి ప్రతిష్టాత్మక అంతర్జాతీయ ఎక్సలెన్స్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో స్థానం దక్కింది. వివేక విద్యాభారతి పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థిని శ్రీవైష్ణవి జూన్‌లో అంతర్జాతీయ ఎక్సలెన్స్ ఆఫ్ వరల్డ్ వారు నిర్వహించిన పోటీల్లో పాల్గొంది. 13నిమిషాల్లో ప్రపంచంలోని అన్ని దేశాల పేర్లు రాసి రికార్డు సృష్టించింది. 14ఏళ్ల వయస్సులో అందరిచే శబాష్ అనిపించుకుంది. శ్రీవైష్ణవికి పంజాబ్‌లోని జలంధర్‌లో గల అంతర్జాతీయ బుక్ ఆఫ్ రికార్డ్స్ నుంచి ప్రశంసా పత్రం, పతకం అందింది. శ్రీవైష్ణవిని శనివారం కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ శశాంక, డీఈవో సుశీందర్‌రావు అభినందించారు. వైష్ణవిని సత్కరించి ప్రశంసాపత్రం అందజేశారు. తెలంగాణ ఖ్యాతిని చాటడం అభినందనీయమని కలెక్టర్ కొనియాడారు. కరస్పాండెంట్ జి.శ్రీనివాసులు, ప్రిన్సిపాల్ మహమూద్‌లను అధికారులు అభినందించారు. కార్యక్రమంలో శ్రుతిలయ కల్చరల్ అకాడమీ చైర్మన్ చిత్తరంజన్, ట్రస్మా రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ శివలింగం, పీఈడీ భాస్కర్ రెడ్డి, టీచర్లు, స్కూల్ డైరెక్టర్లు పాల్గొన్నారు.


గంజి శ్రీవైష్ణవికి ప్రశంసాపత్రం అందజేస్తున్న కలెక్టర్ శశాంక

ఫార్మాసిటీ రద్దుపై చిత్తశుద్ధి కరువు

ఉత్తర్వులు జారీ చేయాలంటున్న రైతులు



ఫార్మాసిటీ కోసం సేకరించి ప్రీ కాస్టింగ్‌తో గోడలు నిర్మించిన టీజీఐఐసీ అధికారులు

యాచారం ఆగస్టు 24: యాచారం, కందుకూరు మండలాల పరిధిలో ఏర్పాటు చేస్తామన్న ఫార్మాసిటీని ప్రభుత్వం వెంటనే రద్దుచేయాలని రైతులు కోరుతున్నారు. కాలుష్యరహిత పరిశ్రమలు ఏర్పాటు చేయాలంటున్నారు. కందుకూరు మండలం బేగరికంచలో స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటుకు తాము వ్యతిరేకం కాదంటున్నారు. స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తున్న ప్రభుత్వం ఫార్మాసిటీ రద్దుపై ఎందుకు ప్రకటన చేయడం లేదని ప్రశ్నిస్తున్నారు. ఫార్మాసిటీ రద్దయినట్టా? లేదా? అని మేడిపల్లి, నానక్‌నగర్, తాటిపర్తి, కుర్మిద్ద, పిల్లిపల్లి, గొల్లగూడ గ్రామాల రైతులు చర్చించుకుంటున్నారు. కాలుష్య రహిత కంపెనీలు ఏర్పాటుకు తాము సహకరిస్తామంటున్నారు. 4వేల ఎకరాల్లో ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ హబ్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవడం అభినందనీయమన్నారు. ఫార్మాసిటీని రద్దు చేసి 9ఏళ్లుగా నిషేధిత జాబితాలో ఉన్న భూములపై నిషేధాన్ని ఎత్తివేయాలని కోరుతున్నారు. కొత్తగా భూసేకరణ చేపట్టకుండా ముఖ్యమంత్రి టీఎస్ఐఐసీ అధికారులను ఆదేశించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. ఫార్మాసిటీకి యాచారం మండలంలో 4వేల ఎకరాల పట్టాభూములు, 4వేల ఎకరాల అస్సైన్డ్ భూములను సేకరించారు. నానక్‌నగర్ మేడిపల్లిల మధ్య మట్టి రోడ్డు వేశారు. ప్రభుత్వం వచ్చేందుకు 4నెలల ముందే రోడ్డు నిర్మాణ పనులు నిలిపేశారు.

భూములు మావి.. కంపెనీలు కందుకూరు మండలానికా?

ఫార్మాసిటీ కోసం ఎక్కువ భూసేకరణ యాచారం మండలంలో చేశారు. 8వేల ఎకరాల భూములు తీసుకున్నారు. 4వేల ఎకరాల అస్సైన్డ్ భూమి తీసుకోవడంతో వందలాది మంది రైతులు గుంట భూమి లేకుండా పోయింది. భూములు పోయినా ప్రభుత్వం ఏదో ఒక ఉపాధి కల్పిస్తుందని భావించిన రైతుల ఆశలు వమ్ముయ్యాయి. కందుకూరు మండలంలో కేవలం 3వేల ఎకరాలే సేకరించారు. అయితే పరిశ్రమలు, సంస్థలన్నీ అక్కడకే తరలిస్తున్నారని మండల వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కుర్మిద్ద, తాటిపర్తి, నానక్‌నగర్ గ్రామాల్లో కాలుష్యరహిత పరిశ్రమలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

ఫార్మాసిటీ రద్దు కాదు : బీఆర్ఎస్

ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం 'నిమ్జ్' హోదా పొందిన ఫార్మాసిటీ రద్దు కాదని, ఎట్టి పరిస్థితుల్లో ఇక్కడ ఫార్మాకంపెనీలుర్పాటవవుతాయని బీఆర్ఎస్ నాయకులు అంటున్నారు. మున్ముందు తమ పార్టీ ప్రభుత్వం వస్తే ఫార్మాసిటీ ఏర్పాటు ఖాయమని చెబుతున్నారు. ఫార్మాసిటీని రద్దుచేసే అధికారం రాష్ట్రానికి లేదని, ఇది కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో కంపెనీలు ఏర్పాటవుతాయని అంటున్నారు. ఇది అధికారులకు తెలుసని, మిగిలిన భూసేకరణ కూడా చేస్తారని ధీమా వ్యక్తం చేస్తున్నారు.

రైతులకు హక్కులు కల్పించాలి



పట్టాభూములను నిషేధిత జాబితా నుంచి తొలగించాలి. పట్టాభూములు అమ్ముకునేలా ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలి. భూమి వివరాల్లో టీజీఐఐసీకి బదులు రైతుల పేర్లను నమోదు చేసేలా ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించాలి. కొత్తగా భూసేకరణ చేపటొట్టుద్దు.

- శ్రీకాంత్‌నాయక్, కుర్మిద్ద తండా

ఫార్మాసిటీని రద్దుచేయాలి



ఫార్మాసిటీ కోసం గత ప్రభుత్వం పేదల భూములను తీసుకొని వీధిన పడేసింది. ఈ ప్రాంతంలో ఫార్మాసిటి రద్దు చేయాలి. ఫార్మాసిటి రద్దు చేసి కాలుష్యం లేని ఐటీ కంపెనీలతో పాటు స్కిల్ యునివర్సిటీ. హెల్త్ టూరిజం హబ్‌ల ఏర్పాటుకు తమకభ్యంతరంలేదు. నిషేధిత జాబితాలో ఉన్న పట్టాభూములపై రైతులకు అన్ని హక్కులు కల్పించాలి. కొత్తగా భూసేకరణ చేయకపోగా సెంటు భూమి లేని నిరుపేదలకు భూములు పంచి ఆదుకోవాలి.


- మహిపాల్‌రెడ్డి, నానక్‌నగర్

ఉద్యోగులకు బదిలీలు తప్పవు

ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి అర్బన్, ఆగస్టు 24: ప్రభుత్వ ఉద్యోగికి సర్వీస్‌లో బదిలీ తప్పదని రంగారెడ్డి కలెక్టర్ శశాంక తెలిపారు. బదిలీపై రంగారెడ్డి జిల్లా నుంచి ఇతర జిల్లాలకు వెళ్లిన జిల్లా అధికారులకు శనివారం సమీకృత జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ శశాంక, అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, డీఆర్వోలతో కలిసి సన్మానాలు నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. ఇటీవల జిల్లా నుంచి బదిలీపై ఏడుగురు జిల్లా అధికారులు ఇతర జిల్లాలకు వెళ్లడం జరిగిందన్నారు. ప్రభుత్వ ఉద్యోగికి బదిలీ అనేది ఉంటుందన్నారు. జిల్లాతో ఉన్న మంచి జ్ఞాపకాలతో వెళుతున్నారని, ఎన్నికల సమయంలో, ప్రముఖుల పర్యటనలో జిల్లా యంత్రాంగానికి సహకరం అందించడం వలన ఎన్నికలను విజయవంతంగా నిర్వహించమన్నారు. ప్రతిమాసింగ్ మాట్లాడుతూ.. బదిలీ అయిన అధికారులు ఈ జిల్లాలోని పనిచేసిన విధంగానే వెళ్లిన చోట కూడా పనిచేయాలన్నారు. బదిలీ అయిన జిల్లా వ్యవసాయ శాఖ అధికారి గీతారెడ్డి, ఉద్యానవన శాఖ అధికారి నీరజ గాంధీ, డీసీసీవో ధాత్రిదేవి, పౌర సంబంధాల అధికారి పద్మశ్రీ, సివిల్ సప్లయీస్ డీఎంవో విజయలక్ష్మిలను సన్మానించారు. కార్యక్రమంలో డీఆర్వో సంగీత, ఏవో సునీల్, ఆర్డీవోలు సూరజ్‌కుమార్, అనంత్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, వేణుమాధవ్, డీఆర్డీఏ డీపీ శ్రీలత, డీపీవో సురేష్ మోహన్, వ్యవసాయ శాఖ అధికారి నర్సింహరావు, ఉద్యాన శాఖ అధికారి భాగ్యలక్ష్మి, డీసీసీవో సుధాకర్, ఎస్సీ కార్పొరేషన్ అధికారి ప్రవీణ్ కుమార్‌రెడ్డి, జిల్లా పరిశ్రమల అధికారి శ్రీలక్ష్మి, సంక్షేమ శాఖ అధికారి పద్మజారమణ, సివిల్ సప్లయీస్ అధికారి మనోహర్‌రాథోడ్, ఎస్ఐసీ అధికారి స్వర్ణలత పాల్గొన్నారు.


బదిలీపై వెళ్లిన అధికారులను సన్మానిస్తున్న కలెక్టర్ శశాంక

ఈ దారి.. పచ్చదారి



పచ్చదనంతో అహ్లాదకరంగా ఉన్న నేదునూరు రోడ్డు వాహనదారులను, ప్రయాణికులను, చూపరులను ఆకట్టుకుంటోంది. హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారి నుంచి గ్రామానికి సుమారు 4కిలోమీటర్ల దూరం రోడ్డు వెంట మాజీ సర్పంచ్ కాసుల రామక్రిష్టారెడ్డి ప్రోత్సాహంతో మొక్కలు మొక్కలు నాటించారు. పూల మొక్కలు, ఏపుగా పెరిగే ఇతర మొక్కలు నాటించారు. మొక్కలు పెరిగి వృక్షాలై ఆహ్లాదాన్ని పంచుతున్నాయి.

- కందుకూరు, ఆగస్టు 24

అడవుల అభివృద్ధిలో బీట్ ఆఫీసర్ల పాత్ర కీలకం

జిల్లా అటవీ శాఖ అధికారి జ్ఞానేశ్వర్

వికారాబాద్, ఆగస్టు 24: అడవుల అభివృద్ధిలో ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ల పాత్ర కీలకమని జిల్లా అటవీ శాఖ అధికారి జ్ఞానేశ్వర్ అన్నారు. తెలంగాణ ఫారెస్ట్ అకాడమిలో శిక్షణ పొందుతున్న 33 మంది బీట్ ఆఫీసర్లు శనివారం శిక్షణలో భాగంగా అనంతగిరిని సందర్శించారు. అనంతగిరి రిజర్వ్ ఫారెస్ట్‌లో అభివృద్ధి చెందుతున్న టూరిజం పార్కింగ్, ట్రెకింగ్ ఏరియా, వాచ్ టవర్, గ్రాస్ ల్యాండ్ ఏరియా వంటి ప్రాంతాలను స్టడీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీట్ ఆఫీసర్లపై ఒత్తిడి ఎక్కువగా ఉంటుందన్నారు. వృత్తి జీవితంలో ఉన్న ఒత్తిళ్లను అధిగమించడానికి సమాజంలోని వ్యక్తులతో, సహచరులతో, ఇతర అధికారులతో ఆరోగ్యకరమైన సంబంధాలు నెలకొల్పుకోవాలని సూచించారు. అడవుల ప్రత్యేకతను బీట్ ఆఫీసర్ గుర్తించి, వాటిని సంరక్షించాలన్నారు. ప్రస్తుతం దేశంలో జనాభా పెరుగుదలతో ఫారెస్ట్ భూములపై తీవ్రమైన ఒత్తిడి ఉందని దీనిని దృష్టిలో ఉంచుకొని తమ విధులను నిర్వర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో వికారాబాద్ ఫారెస్ట్ రేంజ్ అధికారి శ్యామ్ కుమార్, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ అరుణ, తెలంగాణ ఫారెస్ట్ అకాడమి అసిస్టెంట్ డైరెక్టర్ సుభాష్ చంద్ర యాదవ్ పాల్గొన్నారు.


అనంతగిరికి శిక్షణలో భాగంగా వచ్చిన బీట్ ఆఫీసర్లు

ధారూరు మార్కెట్‌లో పెసర బీట్లు

ధారూరు, ఆగస్టు 24: ధారూరు వ్యవసాయ మార్కెట్ యార్డులో శనివారం సాయంత్రం పెసర పంట ఉత్పత్తులకు బీట్లు నిర్వహించారు. మార్కెట్‌కు 1161 సంచుల పెసర్లు రాగా క్వింటాల్‌కు రూ.5,650ల నుంచి రూ.7,450ల వరకు ధర పలికింది. పసుపు 20 సంచులు రాగా క్వింటాలుకు రూ.8,800ల నుంచి 12వేల వరకు ధర పలికిందని మార్కెట్ కమిటీ సహాయ కార్యదర్శి సిద్దమ్మ తెలిపారు. పెసర్లు 580.5 క్వింటాళ్లు, పసుపు 12 క్వింటాళ్ల క్రయవిక్రయాలు జరిగాయని తెలిపారు.

29న పంచాయతీ దుకాణాల వేలం

పూడూరు, ఆగస్టు 24: మండలంలోని మన్నెగూడ పంచాయతీకి చెందిన ఎనిమిది దుకాణాలను అద్దె ప్రాతిపదికన ఇచ్చేందుకు ఈనెల 29న బహిరంగ వేలం నిరహిస్తున్నట్లు పంచాయతీ అధికారులు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వేలంలో పాల్గొనే వారు నిర్ణీత రుసుము రూ.500లు చెల్లించి దరఖాస్తు ఫారం పొందాల్సి ఉంటుందని తెలిపారు. వేలంలో పాల్గొనే వ్యక్తి రెండు ఫొటోలు, ఆధార్‌కార్డు, ఓటరు కార్డు, రేషన్ కార్డు ఏదైనా ఒకటి దరఖాస్తుతోపాటు జత చేయాల్సి ఉంటుంది. ఆస్తి విలువ ధ్రువీకరణ పత్రం, పన్నుల చెల్లింపుల నో డ్యూ సర్టిఫికెట్, వేలంలో పాల్గొనే వారు రూ.30వేలు మొత్తన్ని ఏదైనా జాతీయ బ్యాంకులో టీఎస్-బీపాస్ అకౌంట్ జీపీ మన్నెగూడ పేరున డీడీ వేలానికి ఒకరోజు ముందు అంటే 28వ తేదీ సాయంత్రం 5గంటల వరకు అందజేయాలి. ఒక్కషాప్‌నకు ఒక్కొక్క డీడీ విడిగా దరఖాస్తు సమర్పించాలి. వేలంలో దుకాణం పొందిన వారు రూ.100ల బాండ్ పేపర్‌పై షరతులతో కూడిన ఒప్పందం సమర్పించడంతోపాటు తదితర షరతులు, నిబంధనలు వర్తిస్తాయని తెలిపారు. ఆసక్తిగలవారు పంచాయతీలో వివరాలు తెలుసుకోవచ్చని తెలిపారు.


రంగంపల్లిలో డ్రైనేజీ పనులు ప్రారంభిస్తున్న అధికారులు, నాయకులు

గ్రామాల అభివృద్ధికి ప్రాధాన్యం

పరిగి, ఆగస్టు 24: గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని పరిగి మండల మాజీ వైఎస్ ఎంపీపీ కావలి సత్యనారాయణ అన్నారు. మండల పరిధిలోని రంగంపల్లి గ్రామంలో మండల పరిషత్ నిధుల నుంచి అండర్ డ్రైనేజీ పనులను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి సహకారంతో గ్రామాలను అభివృద్ధి చేస్తామని తెలిపారు. ప్రధానంగా సీసీరోడ్లు, డ్రైనేజీ, వీధిదీపాలు, నీటి సరఫరాకు ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు కె.సురేష్‌చందర్‌రెడ్డి, వీరారెడ్డి, రాజేందర్‌రెడ్డి, శేషిరెడ్డి, కృష్ణ, వెంకటయ్య, స్వామి అనంతయ్య, హనుమంతు, నారాయణరెడ్డి, సత్తయ్య పాల్గొన్నారు.


ధారూరులో బోర్‌వెల్ డ్రిల్లింగ్ పనులను ప్రారంభించిన కాంగ్రెస్ నాయకులు

ధారూరులో ఎస్‌డీఎఫ్ నిధులతో బోర్ డ్రిల్లింగ్

ధారూరు, ఆగస్టు 24: ధారూరు పంచాయతీలో తాగునీటి సమస్యను శాశ్వతంగా నివారించేందుకు శాసనసభ స్పీకర్ జి.ప్రసాద్‌కుమార్ మంజూరు చేసిన ఎస్‌డీఎఫ్ నిధులతో శనివారం బోర్‌డ్రిల్లింగ్ పనులను శనివారం కాంగ్రెస్ నాయకులు ప్రారంభించారు. రెండు బోర్లు డ్రిల్లింగ్, పంప్‌సెట్లు బిగింపునకు ఎస్‌డీఎఫ్ ద్వారా రూ.5లక్షలు మంజూరయ్యాయి. ఈ నిధులతో ధారూర్‌లోని పాత కమ్యూనిటీ హాల్ పక్కన ఉన్న మిషన్ భగీరథ తాగునీటి ట్యాంకు వద్ద బోర్‌డ్రిల్లింగ్ చేశారు. మిషన్ భగీరథ నీటిసరఫరాలో అంతరాయం కలిగితే ఈ బోర్‌ద్వారా నీటిని ట్యాంకులో నింపి గ్రామానికి తాగునీరు సరఫరా చేయనున్నారు. కాగా ధారూరు పంచాయతీ ప్రజల తాగునీటి అవసరాలు తీర్చేందుకు రూ.70.20 లక్షలు మంజూరు చేయించిన స్పీకర్ ప్రసాద్‌కుమార్‌కు స్థానిక కాంగ్రెస్ నాయకులు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి అంజానాయక్, నాయకులు బుజ్జయ్యగౌడ్, కిరణ్‌కుమార్, బాబాఖాన్, బి.అంజయ్య, ముజాఫర్, అశోక్‌ముదిరాజ్, మల్లికార్జున్, ఎస్.అశోక్, ఇబ్రహీం, లింగం, శివరాజ్ తదితరులు పాల్గొన్నారు.

పరిశోధన రంగంలో ముందంజలో భారత్



డీఆర్డీవో సైంటిస్ట్ ప్రవీణ్ కుమార్‌ను సన్మానిస్తున్న ఎంఆర్‌సీఈ కళాశాల యాజమాన్యం

మేడ్చల్ టౌన్, ఆగస్టు 24: కొత్త పరిశోధనలో భారత్ ముందంజలో ఉందని డీఆర్డీవో సైంటిస్టు డాక్టర్ ప్రవీణ్ కుమార్ అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ మైసమ్మగూడ మల్లారెడ్డి కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్‌లో శనివారం నిర్వహించిన స్పేస్ డే కార్యక్రమంలో ప్రవీణ్ కుమార్ పాల్గొని ప్రసంగించారు. మెజాయిల్ తయారీ పరిశోధన రంగంలో దేశం గణనీయంగా అభివృద్ధి చెందిందన్నారు. భవిష్యత్తులో కొత్త ప్రయోగాలతో మెజాయిల్ రంగంలో కొత్త ఆవిష్కరణలు చేయనుందన్నారు. ఈ మధ్య కాలంలో సాంకేతిక రంగంలో దేశంలో సాధించిన పలు అంశాల గురించి విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ.అశోక్, హెచ్‌వోడీ డాక్టర్ సంపత్ కుమార్, కన్వీనర్లు డాక్టర్ వంశీ, శివకుమార్, పాషా పాల్గొన్నారు.

అంగన్‌వాడీ టీచర్ల సమస్యలు పరిష్కరించాలి

పరిగి, ఆగస్టు 24: అంగన్‌వాడీ టీచర్ల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ టీచర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పరిగి సీడీపీవోకు శనివారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మినీ నుంచి మెయిన్ కేంద్రాలుగా మారిన టీచర్లకు జూలై మాసం వేతనాలు మెయిన్ టీచర్లతో సమానంగా ఇవ్వాలని కోరారు. గత మార్చి, ఏప్రిల్ నెలలకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న వేతనాలు ఇవ్వాలని కోరారు. అంగన్‌వాడీ టీచర్ల విషయంలో ప్రభుత్వం మాటమారుస్తోందన్నారు. ఈ సమస్యలను వెంటనే పరిష్కరించాలని, లేదంటే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు మంజుల, స్వరూప, దేవి, విజయ, రుక్కిబాయి, శాంతి, బుజ్జిబాయి, రేణుక, సునీత, లలిత పాల్గొన్నారు.


పరిగి సీడీపీవోకు వినతిపత్రాన్ని అందజేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

పాఠశాలల్లో ముందస్తు కృష్ణాష్టమి వేడుకలు



వికారాబాద్: భృంగీ పాఠశాలలో కృష్ణాష్టమి వేడుకల్లో విద్యార్థులు



పూడూరు: తిర్మలాపూర్ ప్రాథమిక పాఠశాలలో చిన్నికృష్ణులు, గోపికల వేషధారణలో చిన్నారులు



తాండూరు రూరల్: కృష్ణాష్టమి వేడుకల్లో విద్యార్థులు

వికారాబాద్, ఆగస్టు 24: స్థానిక భృంగీ పాఠశాలలో శనివారం కృష్ణాష్టమి ముందస్తు వేడుకలను ఘనంగా నిర్వహించారు. చిన్నారులు కృష్ణుడు, గోపికల వేషధారణలో ఆకట్టుకున్నారు. చిన్నికృష్ణులు ఉట్టికొట్టేందుకు పోటీపడ్డారు.

తాండూరు రూరల్: మండల పరిధిలోని చిట్టిఘనాపూర్, చెంగోల్ ప్రభుత్వ పాఠశాలల్లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. పాఠశాలలో విద్యార్థినీ, విద్యార్థులు కృష్ణుడు, గోపికల వేషధాణలో అలరించారు. మాజీ సర్పంచ్ మంజురాణి, హెచ్ఎం నర్సిరెడ్డి, హెచ్ఎం కిష్టప్ప, మహిళా ఉపాధ్యాయులు స్వప్న, నవీనజ్యోతి, నర్మద, ఈశ్వరమ్మ, ప్రమోద్‌కుమార్, శశివర్ధ, విద్యార్థులు పాల్గొన్నారు.

పరిగి: మునిపసిపల్ పరిధిలోని హరిజన్‌వాడ ప్రాథమిక పాఠశాలల్లో చిన్నారులు చిన్నికృష్ణుల వేషధారణలతో ఆటపాటలతో నృత్యాలు చేశారు. విద్యార్థులు పెరుగుబసంతం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆటపాటలతో ఉట్టిని కొట్టారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం జయరాం, ఉపాధ్యాయులు సుహాసిని, శ్రీశైలం, సునీత, ఝాన్సీ, దాస్య, శ్రీశైలం యాదవ్ పాల్గొన్నారు. అదేవిధంగా సోమవారం(రేపు) పెద్దఎత్తున నిర్వహించనున్న శ్రీకృష్ణాష్టమి వేడుకలను విజయవంతం చేయాలని పరిగి మాజీ సర్పంచ్ సిద్దాంతి పార్థసారథి, హిందూ ఉత్సవ కమిటీ కార్యదర్శి ఎం.నాగేశ్వర్‌లు కోరారు. శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. ఉదయం 10 గంటలకు శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి దేవాలయం ప్రాంగణం నుంచి వేణుగోపాలస్వామి వరకు శోభయాత్ర కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు రామస్వామి, బృంగి హరికృష్ణ, పెంటయ్య, శ్రీనివాస్, బుచ్చిలింగం పాల్గొన్నారు.

పూడూరు: తిర్మలాపూర్, కడుమూరు ప్రాథమిక పాఠశాల్లో శనివారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు కృష్ణుడు, రాధా, గోపికల వేషధారణలో అలరించారు. పాఠశాలల్లో జన్మాష్టమి వేడుకలతో పండుగ వాతావరణం నెలకొంది. ఆయా పాఠశాలల హెచ్ఎంలు శ్రీనివాస్, మధు, ఉపాధ్యాయులు హరీష్, అనూష పాల్గొన్నారు.

దోమ: శ్రీ కృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకొని శనివారం బొంపల్లి పాఠశాలలో విద్యార్థులు గోపికలు, శ్రీ కృష్ణుడి వేషధారణలతో ఆకట్టుకున్నారు. నృత్య ప్రదర్శనలు, పాటలు పాడటం లాంటి కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం షఫీ, ఉపాధ్యాయులు స్వప్న, జరీనాబేగం, వెంకటయ్య, విజయ్ సాయి, అనంతయ్య, నరేందర్, రుక్మిణి, సీఆర్‌పీ వెంకటేశ్ పాల్గొన్నారు.

కులకచర్ల: కులకచర్ల ప్రాథమిక, అల్లాపూర్ పాఠశాలలో ముందస్తుగా శ్రీ కృష్ణజన్మాష్టమి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలతో కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. గ్రామంలో వీధుల మీదుగా ఊరేగుతూ ఉట్లు కొట్టారు. హెచ్ఎంలు శ్రీనివాస్, శంకర్‌రావులు శ్రీకృష్ణాష్టమి వేడుకల విశిష్టతను విద్యార్థులకు వివరించారు.

మేడ్చల్‌టౌన్: పట్టణంలోని సేయింట్ ప్యాట్రిక్స్ పాఠశాలలో శనివారం విద్యార్థులు కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ సుబ్బ రామయ్య రెడ్డి, కరస్పాండెంట్ స్వామి దాస్, ప్రిన్సిపాల్ రాజలింగం పాల్గొన్నారు.

కీసర: రాంపల్లి దాయరలోని జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్‌లో కృష్ణాష్టమి ముందస్తు వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు చిన్ని కృష్ణుడి, గోపికల వేషాదారణలో పలువురుని ఎంతగానో ఆకట్టుకున్నాయి.



కీసర: రాంపల్లి దాయరలోని జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్‌లో కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించిన నిర్వాహకులు



దోమ: బొంపల్లి ప్రాథమిక పాఠశాలలో శ్రీకృష్ణుడు, గోపికల వేషాధారణలో విద్యార్థులు



కులకచర్ల: ప్రాథమిక పాఠశాలలో శ్రీ కృష్ణజన్మాష్టమి వేడుకలు



మేడ్చల్ టౌన్: సేయింట్ ప్యాట్రిక్స్‌లో కృష్ణాష్టమి వేడుకలు



పరిగి: హరిజన్‌వాడ పాఠశాలలో ముందస్తు కృష్ణాష్టమి వేడుకల్లో చిన్నారులు

డ్రైనేజీ పనులను అడ్డుకున్న గ్రామస్తులు



డ్రైనేజీ పైప్‌లైన్ తవ్విస్తున్న మున్సిపల్ కమిషనర్

మేడ్చల్ టౌన్, ఆగస్టు 24: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని కండ్లకోయలో నిర్మించిన మైల్‌స్టోన్ కమర్షియల్ కాంప్లెక్స్ నుంచి వచ్చే మురికి నీరును స్థానిక చెరువులో కలపటానికి ఏర్పాటు చేస్తున్న డ్రైనేజీ పనులను శనివారం స్థానికులు అడ్డుకున్నారు. మైల్‌స్టోన్ కమర్షియల్ కాంప్లెక్స్ నుంచి వచ్చే మురికి నీరును సమీపంలోని పోల్కమ్మ కుంట చెరువులో కలపడానికి కమిషనర్ అజ్మీరాస్వామినాయక్, వైస్‌చైర్మన్ ప్రభాకర్‌లు మున్సిపల్ సిబ్బందితో కలిసి జేసీబీతో తవ్విస్తుండగా స్థానికులతో కలిసి ముదిరాజ్ సంఘం వారు అడ్డుకున్నారు.

బీఎల్‌వో విధుల నుంచి మినహాయించాలి

తాండూరు రూరల్, ఆగస్టు 24: ఎమ్మెల్యే, ఎంపీ ఎన్నికల్లో బీఎల్‌వోగా విధులు నిర్వహించిన తమను ఒకపై ఆ విధుల నుంచి మినహాయించాలని పంచాయతీ కార్యదర్శులు శనివారం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా తాండూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద కార్యదర్శులు మాట్లాడారు.బీఎల్‌వోగా విధులు నిర్వహించాలంటే ఈసీ నిబంధనల ప్రకారం స్థానికంగా నివాసం ఉండి, ఓటరుగా నమోదైన వ్యక్తి మాత్రమే బీఎల్‌వోగా విధులు నిర్వహించాలన్నారు.

బదిలీపై ఎక్కడికెళ్లినా గుర్తింపు తెచ్చుకోవాలి

కులకచర్ల, ఆగస్టు 24: ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు సహజమేనని, ఎక్కడికెళ్లినా గుర్తింపు తెచ్చుకోవాలని ఎంఈవో హబీబ్ అహ్మద్ అన్నారు. మండలంలోని బండవెల్కిచర్ల ప్రాథమిక పాఠశాలలో బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు శనివారం సన్మానించారు. బదిలీపై వెళ్లిన రాములు, బస్వరాజు, శేఖర్, వెంకటేశ్వరరావును పాఠశాల ఆవరణలో ఘనంగా సన్మానించారు. పాఠశాలకు నూతనంగా వచ్చిన హెచ్ఎం వీరేశం, రమేశ్, సోమ్లా, సంతోష్‌లను సన్మానించి ఎంఈవో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయులు శరత్‌కృష్ణ, పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు వెంకటేశ్, గౌరవ అధ్యక్షుడు రాఘవేందర్‌రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు నర్సింహులుగౌడ్, వెంకటయ్య, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కల్తీకల్లు బాధితులను ఆదుకోవాలి

వికారాబాద్, ఆగస్టు 24: కల్తీకల్లు బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని బీఆర్ఎస్ వికారాబాద్ మండల అధ్యక్షుడు కమాల్‌రెడ్డి అన్నారు. వికారాబాద్ మిషన్ ఆస్పత్రిలో శనివారం కల్తీకల్లు వల్ల చికిత్స పొందుతున్నబాధితులను మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ ఆదేశాల మేరకు సందర్శించి పరామర్శించారు. మిషన్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మాసన్న గారి వెంకటమ్మ పరిస్థితి విషమంగా ఉందన్నారు.

ఆలయాల్లో భక్తుల పూజలు



యాలాల: జుంటుపల్లి రామస్వామి ఆలయంలో క్యూ కట్టిన భక్తులు

యాలాల, ఆగస్టు 24: జుంటుపల్లి రామస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. శ్రావణమాసం మూడో శనివారం పురస్కరించుకొని భక్తులు అధిక సంఖ్యలో శనివారం సీతారామస్వామి దర్శనం చేసుకున్నారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు చుట్టుపక్కల గ్రామాల ప్రజలతో పాటు తాండూరు నుంచి భక్తులు అధికసంఖ్యలో హాజరయ్యారు. ఆలయ ధర్మకర్త హనుమంత రావు ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు.

ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు

బొంరాస్‌పేట్: మండలంలోని చిలుముల్‌మైలారంలో గల శ్రీ ఆంజనేయస్వామి ఆలయంలో మూడో శనివారం సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. చిలుముల్‌మైలారంతో పాటు పరిసర గ్రామాల ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

శ్రీ విష్ణు, శివాలయం వద్ద అన్నదానం

మూడుచింతలపల్లి: ఉద్దెమర్రి గ్రామ పరిధిలోని అతిపురానమైన అక్కన్న, మాదన్నల కాలంనాటి శ్రీ విష్ణు, శివాలయంలో ఉద్దెమర్రికి చెందిన మల్లారెడ్డి కుటుంబ సభ్యులు, అల్వాల్‌కు ఇషాన్‌సోడా కుటుంబ సభ్యులు ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

అయ్యప్ప ఆలయంలో పూజలు

మేడ్చల్ టౌన్: స్థానిక అయ్యప్పస్వామి ఆలయంలో వార్షిక పూజలు శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలోని స్వామి వారి విగ్రహానికి ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయం ప్రాంగణంలో ధ్వజస్తంభాన్ని పూలతో అలంకరించటంతో పాటు విద్యుద్దీపాలను ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు.

అక్రమ డబ్బాల తొలగింపునకు రంగం సిద్ధం



కండ్లకోయ చౌరస్తా వద్ద రోడ్డుకు ఇరువైపులా అక్రమంగా ఏర్పాటు చేసుకున్న డబ్బాలు

మేడ్చల్ టౌన్, ఆగస్టు 24: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ కండ్లకోయ చౌరస్తా వద్ద రోడ్డుకు ఇరువైపులా అక్రమంగా ఏర్పాటు చేసుకున్న డబ్బాలను తొలగించడానికి మున్సిపల్ అధికారులు రంగం సిద్ధం చేశారు. జాతీయ రహదారి నుంచి కండ్లకోయ గ్రామం వైపు వస్తున్న రోడ్డుకు ఇరువైపులా కొందరు అక్రమంగా డబ్బాలు ఏర్పాటు చేసుకుని వ్యాపారం చేసుకుంటున్నారు. ఫలితంగా రోడ్డు ఇరుకుగామారి వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయని పలువురు స్థానికులు మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో స్పందించిన అధికారులు డబ్బాల తొలగింపునకు నిర్ణయం తీసుకున్నారు. ఈ వ్యాపారుల వద్ద కొందరు స్థానిక రాజకీయ నాయకులు నెల సరి మామూళ్లు వసూలు చేసి పబ్బంగడుపుకుంటున్నాని, విద్యుత్ కనెక్షన్లు ఇప్పించి రోడ్డు కబ్జాకు పెట్టి పోషిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. కాగా ఇప్పటికే మున్సిపల్ తరపున వ్యాపారస్తులకు నోటీసులు పంపినట్లు అధికారులు చెబుతున్నారు. అయినప్పటికీ వారు పట్టించుకోకపోవటంతో ఇక బలవంతంగా డబ్బాలను తొలగించడానికి సిబ్బంది సన్నద్ధమవుతున్నట్లు తెలిసింది. డబ్బాలు ఏర్పాటు చేసుకోవటంతో పాటు పలు అక్రమ నిర్మాణాలను మున్సిపల్ అధికారులు గుర్తించారు. అక్రమ నిర్మాణాలు, డబ్బాలను తొలగించే వేళ ఇబ్బందులు కలగకుండా ముందు జాగ్రత్తగా బందోబస్తుగా స్థానిక పోలీసులకు దరఖాస్తు చేసుకున్నారు. రెండు మూడు రోజుల్లో డబ్బాలను స్వతహాగా తొలగించుకోకపోతే మున్సిపల్ సిబ్బంది నేరుగా తొలగించే పనులను ప్రారంభిస్తుందని ఇధికారులు ఇప్పటికే హెచ్చరికలు జారీ చేశారు.

హోటళ్లలో ఆకస్మిక తనిఖీ

- రూ.95వేలు జరిమానా వసూలు

కీసర రూరల్, ఆగస్టు 24: నాణ్యతా ప్రమాణాలు పాటించని హోటళ్లపై చర్యలు తీసుకుంటామని నాగారం మున్సిపల్ కమిషనర్ రాజేందర్‌కుమార్ హెచ్చరించారు. మున్సిపల్ పరిధిలోని పలు హోటళ్లలో శనివారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాసిరకం ఆహార పదార్థాలు విక్రయించి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడొద్దన్నారు. విజయదుర్గ రెస్టారెంట్, అరేబియన్ మండి, ఓహో హైదరాబాది హోటల్, హవిన హోటల్, రెడ్ బకెట్ బిర్యాని, గోదావరి రెస్టారెంట్ తదితర హోటళ్లపై జరిమానా విధించి, రూ.95వేలు వసూలు చేసినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో సానిటేషన్ ఇన్‌స్పెక్టర్ రాంరెడ్డి, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

పనిచేసే సంస్థకే టోకరా

ఘట్‌కేసర్ రూరల్, ఆగస్టు 24: పనిచేసే సంస్థకే టోకరాపెట్టిన వ్యక్తిపై పోచారం ఐటీసీ పోలీసులు కేసునమోదు చేశారు. సీఐ రాజు వర్మ తెలిపిన వివరాల ప్రకారం. పోచారం మున్సిపాలిటీ, అన్నోజిగూడలోని రిలయన్స్ రిటైల్ సూపర్‌మార్కెట్‌లో పిన్నగాని రంజిత్ కుమార్ ఆరు సంవత్సరాలుగా క్లష్టర్ మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. కాగా సూపర్‌మార్కెట్‌లో ఎక్కువ వస్తువులను విక్రయించి తక్కువ వస్తువులు విక్రయించినట్లు బిల్లువేసి తప్పుదోవ పట్టించాడు. పాలు ఉత్పత్తులు, పండ్లు, ఆహార, కూరగాయాలతో పాటు పలు రకాల వస్తువులను తన కుటుంబసభ్యులకు, స్నేహితులకు బిల్లింగ్ చేయకుండానే పంపించేవాడు. అనుమానం వచ్చిన సూపర్‌మార్కెట్ యజమాని గత ఏప్రిల్ నెలలో ఆడిట్ చేయగా రూ.7,48,089 నగదు దుర్వినియోగమైనట్లు గ్రహించి రంజిత్‌కుమార్‌పై పోచారం ఐటీసీ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఇంజనీరింగ్ సీటు ఇప్పిస్తామని మోసం

ఘట్‌కేసర్ రూరల్, ఆగస్టు 24: ఓ ఇంజనీరింగ్ కళాశాలలో సీటు ఇప్పిస్తానని డబ్బులు కాజేసిన ఇద్దరు వ్యక్తులపై ఘట్‌కేసర్ పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ సైదులు తెలిపిన వివరాల ప్రకారం.. సికింద్రాబాద్, రెజిమెంటల్‌బజార్‌కు చెందిన జక్కుల కృష్ణవేణి తన కుమారుడు అభినవ్ ఘట్‌కేసర్ మండలం, అవుశాపూర్‌లోని ఓ ఇంజనీరింగ్ కళాశాలలో మేనేజ్‌మెంట్ కోటాలో సీటు ఇప్పిస్తానని లాలాపేట్‌కు చెందిన జలేందర్‌చారి, సికింద్రాబాద్ కార్ఖానాకు చెందిన లెనిన్‌గౌడ్‌లు చెప్పారు. ఇందుకు గానూ రూ.3,30,000లు అవుతాయని చెప్పడంతో అభినవ్ తల్లి ఈనెల 10న జలేందర్‌చారి, లెనిన్‌గౌడ్‌లకు ఆ మొత్తాన్ని ఇచ్చింది. రెండువారాలు గడుస్తున్న కళాశాల సీటు ఇప్పించలేదు. దీంతో అభినవ్ అతడి తల్లి పలుమార్లు సీటు గురించి ఫోన్‌చేసినా స్పందించలేదు. దీంతో బాధితులు శనివారం ఘట్‌కేసర్ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

సంక్షిప్తంగా..

- **ధారూరు/పరిగి:** ధారూరులో నేడు(ఆదివారం) విద్యుత్ అంతరాయం కలుగుతుందని మండల ట్రాన్స్‌కో ఏఈ వేణుగోపాల్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ధారూరులో 11కేవీ విద్యుత్ ఫీడర్ లైన్ మరమ్మతులు చేపడుతున్నందున ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా పరిగి మున్సిపల్ పరిధిలో ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ ఖాజా తెలిపారు.
- **కులకచర్ల:** విద్యార్థులు క్రమశిక్షణతో ఉంటూ సమయపాలన పాటించాలని శ్రీ రామలింగేశ్వర కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆలూరి కామేశ్వరి అన్నారు. స్థానిక శ్రీ రామలింగేశ్వర జూనియర్ డిగ్రీ కళాశాలలో శనివారం ఫ్రెషర్స్ డే నిర్వహించారు.
- **కీసర రూరల్:** నల్లా బిల్లుల బకాయిలు మాఫీ చేయాలని దమ్మాయిగూడ మున్సిపల్ పరిధిలోని ఖుషీ గార్డెన్, ప్రగతి నగర్, గాంధీనగర్, శివానందపురి కాలనీ వాసులు డిమాండ్ చేశారు. నీటి బిల్లుల చెల్లింపు విషయమై శనివారం నాలుగు కాలనీల ప్రజలు ప్రగతి నగర్ కాలనీలో సమావేశమయ్యారు. ఎన్నికల హామీని మరిచిన జలమండలి అధికారులు ఇప్పుడు బిల్లులు చెల్లించాలని ఒత్తిడి చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం అధికారులకు వినతిపత్రం అందజేశారు.
- **బొంరాస్‌పేట్:** టీవీవీ ఆధ్వర్యంలో యూత్ ఫర్ సేవా స్వచ్ఛంద సంస్థల సహకారంతో నాందర్‌పూర్, దుద్యాల పాఠశాలల్లో మొత్తం 150మందికి శనివారం బ్యాగులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో రాంరెడ్డి, టీవీవీ నాయకులు రవీందర్‌గౌడ్, గౌరారం గోపాల్, హెచ్ఎం రామారావు, మల్లయ్య పాల్గొన్నారు.
- **దోమ:** గూడూరు, దొంగ ఎన్కెపల్లి యూపీఎస్ పాఠశాలలను శనివారం మండల నోడల్ అధికారి వెంకట్ తనిఖీ చేశారు. పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం కృష్ణయ్య, షాహీన్‌బేగం, సీఆర్‌పీ వెంకటేశ్ పాల్గొన్నారు.
- **కొడంగల్:** కొడంగల్ శ్రీ మహాలక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయ ధర్మకర్త నందారం మిడిదొడ్డి నర్సింహులుగుప్త 43వ వర్ధంతిని శనివారం నిర్వహించారు. ఆలయ ఆవరణలో గల ఆయన విగ్రహానికి కుటుంబ సభ్యులు, ఆలయ ధర్మకర్తలు, పురోహితులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆలయంలో శ్రీ వైఖానస ఆగమశాస్త్ర ప్రకారం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.
- **వికారాబాద్:** ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం పట్టణంలోని ఆయావార్డులకు చెందిన లబ్ధిదారులకు 37మందికి కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సుధాకర్ రెడ్డి సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు.
- **వికారాబాద్:** దామగుండంలో ఏర్పాటు చేసిన నావి ర్యాడర్ విషయంలో ప్రభుత్వాలు మరో మారు ఆలోచించాలని, లేదంటే బాధితులకు పరిహారం, భూమికి భూమి కల్పించాలని ఏఐకేఎంఎస్ జాతీయ అధ్యక్షుడు వెంకటరామయ్య, రాష్ట్ర అధ్యక్షులు కోటేశ్వర్ రావు, కార్యవర్గ సభ్యులు మండల వెంకన్న, జిల్లా నాయకులు మహేందర్ తదితరులు శనివారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కోరారు.
- **వికారాబాద్:** ఓపెన్ స్కూల్ ద్వారా దూర విద్య మాధ్యమంలో టెన్త్, ఇంటర్మీడియట్ అడ్మిషన్లు జరుగుతున్నాయని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రిన్సిపాల్, కో ఆర్డినేటర్ వెంకటయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఆగస్టు 31 తేదీ నాటికి పదోతరగతిలో అడ్మిషన్ పొందాలన్నారు. రూ.25ఫైన్‌తో సెప్టెంబర్ 4వ తేదీ, రూ.50ఫైన్‌తో సెప్టెంబర్ 9 వరకు చెల్లించాలన్నారు.
- **తాండూరు రూరల్:** చంద్రవంచ పల్లెహనుమాన్ ఆలయం వారి ఆధ్వర్యంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బాల్‌రెడ్డి, డైరెక్టర్ జర్నప్పలను శనివారం సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రభాకర్‌రెడ్డి, ప్రసాద్, విజయ్‌కుమార్, బాలేశ్వర్‌గౌడ్, శ్రీధర్‌గౌడ్ పాల్గొన్నారు.
- **బషీరాబాద్:** బషీరాబాద్‌లో నూతనంగా నిర్మిస్తున్న శ్రీధర్మశాస్త్ర అయ్యప్ప స్వామి ఆలయ నిర్మాణానికి తాండూరు మార్కెట్ కమిటీ చైర్మన్, మునిసిపల్ కౌన్సిలర్ నీరజబాల్‌రెడ్డి దంపతులు రూ.1.18లక్షల విరాళాన్ని ఆదివారం అందజేశారు. తాండూరులోని ఆయన నివాసంలో ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షులు సాయిల్ గౌడ్‌కు స్వయంగా అందించారు. ఈ కార్యక్రమంలో శ్రీను, ఉల్లప్ప, పవాన్‌ఠాగూర్, నరేష్‌చౌహాన్, ధన్‌సింగ్, వీరేశం తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

మత్తుపదార్థాల తయారీ కేంద్రంపై టాస్క్‌ఫోర్స్ దాడి


- రూ. 30 లక్షల విలువైన ముడిసరుకు స్వాధీనం
- పోలీసుల అదుపులో ఐదుగురు నిందితులు



వివరాలు వెల్లడిస్తున్న వీబీ కమలాసన్‌రెడ్డి

ఘట్‌కేసర్ రూరల్, ఆగస్టు 24: మేడ్చల్ జిల్లా కాచవానిసంగారంలో గుట్టు చప్పుడు కాకుండా అల్ప్రాజోలం (మత్తుపదార్థాలు) తయారు చేస్తున్న కేంద్రంపై రాష్ట్ర ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేసి రూ. 30 లక్షల విలువైన ముడిసరుకును స్వాధీనం చేసుకున్నారు. సూర్యాపేటకు చెందిన మీనా శ్రీనివాస్ (49), పోలీశెట్టిరాంబాబు (47), గాజులరామారానికి చెందిన తాడి లక్ష్మయ్య (50), వనస్థలిపురానికి చెందిన కాకర్ల చంద్రశేఖర్ (48) మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్ మండలం కాచవానిసంగారంలో ఓ ఇంటిని అద్దెకు తీసుకున్నారు. పలు ఫార్మా కంపెనీల్లో పని చేసిన మీనా శ్రీనివాస్, పోడిశెట్టి రాంబాబు డబ్బులు సంపాదించాలనే అత్యాశతో లక్షలు వెచ్చించి అల్ప్రాజోలం తయారు చేసే ఫార్ములాను ఓ కెమికల్స్ సంస్థ యజమాని నుంచి కొనుగోలు చేశారు. అనంతరం దానికి వినియోగించే ముడిపదార్థాలను పలు దుకాణాల్లో కొనుగోలు చేసి అల్ప్రాజోలం తయారీ మొదలు పెట్టారు. విశ్వసనీయ సమాచారంతో రాష్ట్ర ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ అధికారులు ఈ కేంద్రంపై దాడి చేసి 2 కిలోల 91 గ్రాముల అల్ప్రాజోలం, రూ. 30 లక్షల విలువైన ముడిసరుకును స్వాధీనం చేసుకుని నిందితులను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు.

కుక్కల దాడిలో లేగదూడలు మృత్యువాత



మృత్యువాతపడిన లేగదూడలు

కీసర, ఆగస్టు 24: కుక్కల దాడిలో లేగదూడలు మృత్యువాత పడిన ఘటన కీసరలో శనివారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కీసరకు చెందిన కుంటోళ్ల మల్లారెడ్డి ఇటీవల రూ.3లక్షలు వెచ్చించి రెండు గేదెలతో పాటు దూడలను కొనుగోలు చేశాడు. ఎప్పటిలాగే గేదెలను మేతకు తీసుకెళ్లగా లేగదూడలను పాకలో కట్టివేశాడు. ఇంతలో కుక్కలు వచ్చి కట్టేసిన లేగదూడలపై దాడిచేసి చంపేశాయి. లేగదూడలు లేకుండా గేదెలు పాలు ఇవ్వడం కష్టమని, దీంతో ఆర్థికంగా నష్టపోతున్నామని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు. కాగా వారం రోజుల కిందట మల్లారెడ్డి పాక పక్కనే ఉన్న కందాడి రాంగోపాల్‌రెడ్డి పాకలో కట్టేసిన నాలుగు మేకలను కుక్కలు దాడి చంపేశాయి. ఇలాంటి ఘటనలు మరోసారి జరగకముందే అధికారులు తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

గడ్డిమందు చల్లిన మేత తిని ఎద్దు, ఆవు..

తాండూరు రూరల్, ఆగస్టు 24: గడ్డిమందు చల్లిన మేత తిని ఎద్దు, ఆవు మృత్యువాతపడ్డాయి. ఈ సంఘటన తాండూరు మండలంలోని వీరారెడ్డిపల్లిలో శనివారం చోటుచేసుకుంది. వీరారెడ్డిపల్లి గ్రామానికి చెందిన రైతు తన రెండు ఎడ్లు, ఒక ఆవును రోజూ మాదిరిగా మేతకు తీసుకెళ్లాడు. గ్రామానికి చెందిన నర్సింహులు పొలంలో గడ్డిమందు పిచికారి చేశాడు. ఈ గడ్డిమందు పిచికారి చేసిన గడ్డిని ఎద్దు, ఆవు తిన్నాయి. దీంతో అస్వస్థతకు గురై మృత్యువాతపడ్డాయి. ఆనంద్ కరన్‌కోట్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్ఐ విఠల్‌రెడ్డి గ్రామానికి వెళ్లి విచారణ చేపట్టారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

పట్టపగలు చోరీలకు పాల్పడుతున్న ఇద్దరి అరెస్ట్



నిందితుల అరెస్టు చూపుతున్న డీఎస్పీ

తూప్రాన్, ఆగస్టు 24: పట్టపగలు చోరీలకు పాల్పడుతున్న అంతర్ జిల్లాల ఇద్దరు పాత నిందితులను పోలీసులు పట్టుకున్నారు. మెదక్, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలకు చెందిన ఐదు చోరీల్లో నిందితుల నుంచి బంగారం, వెండి ఆభరణాలు, నగదు రికవరీ చేశారు. ఇద్దరు నిందితులను శనివారం రాత్రి అరెస్టు చేశారు. తూప్రాన్ పోలీసు సబ్ డివిజన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో డీఎస్పీ వెంకట్‌రెడ్డి వివరాలు వెల్లడించారు. మెదక్ జిల్లా హవేలీఘనపూర్ మండలం ముత్తాయిపల్లి గ్రామానికి చెందిన గోకన్ విష్ణువర్దన్‌రెడ్డి (24), చలిపేట భూపతిపూర్ గ్రామానికి చెందిన మరాటి ప్రశాంత్(26) మేడ్చల్ హౌజింగ్‌బోర్డు కాలనీ, కిషాపూర్‌లో నివాసముంటున్నారు. తూప్రాన్‌లో ఎస్ఐ శివానందం సిబ్బంది నిర్వహిస్తున్న వాహన తనిఖీల్లో బైక్‌పై వస్తూ అనుమానాస్పదంగా కనిపించగా వీరిద్దరినీ అదుపులోకి తీసుకున్నారు. విచారణలో చోరీలకు పాల్పడినట్లు ఒప్పుకున్నట్లు తెలిపారు. గతనెల 29న మనోహరాబాద్ మండలం జీడిపల్లిలో బొల్లెబోయిన శేఖర్ ఇంట్లో, ఈనెల 10న తూప్రాన్ మండలం నాగులపల్లికి చెందిన అబ్బూరి అనసూయ ఇంట్లో పట్టపగలు చోరీలకు పాల్పడ్డారు. అదేవిధంగా మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధి మరో మూడిళ్లలో చోరీలకు పాల్పడ్డారు. వీరిద్దరి వద్ద నుంచి ఐదు కేసుల్లో 6.5తులాల బంగారు ఆభరణాలు, 43తులాల వెండి ఆభరణాలు, రూ.20వేల నగదు రికవరీ చేశారు. యాక్టివాను సీజ్ చేశారు. విష్ణువర్దన్‌రెడ్డి గతంలో నాలుగు కేసుల్లో, ప్రశాంత్ ఒక చోరీ కేసులో అరెస్టు చేసినట్లు డీఎస్పీ వెంకట్‌రెడ్డి వివరించారు. చోరీల కేసులను ఛేదించిన సీఐ రంగకృష్ణ, ఎస్ఐ శివానందం, కానిస్టేబుళ్లు సురేష్, గోవర్ధన్‌లను అభినందించారు. ఈ సమావేశంలో సీఐ రంగకృష్ణ, ఎస్ఐలు శివానందం, సుభాష్‌గౌడ్ పాల్గొన్నారు.

చోరీ కేసులో ఇద్దరు నిందితుల రిమాండ్



పోలీసుల అదుపులో జగ్గప్ప, రాములు

తాండూరు రూరల్, ఆగస్టు 24: మండలంలోని కరన్‌కోట్ బండల గనుల్లో కేబుల్ వైర్లు చోరీకి గురైనట్లు గ్రామానికి చెందిన తుపాకుల బసప్ప, గనిలో వన్‌హెచ్ మోటార్లు దొంగతనం జరిగినట్లు మేస్త్రీ దుర్గప్పలు పోలీసులకు వేర్వేరుగా ఫిర్యాదు చేశారు. ఈ మేరకు రెండు కేసులు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టగా మల్కాపూర్ గ్రామానికి చెందిన జగ్గప్ప, రాములు అనే వ్యక్తులపై అనుమానంతో అదుపులోకి తీసుకుని విచారించారు. దీంతో తామే దొంగిలించామని వారు ఒప్పుకున్నారు. కేబుల్ వైర్లు, వన్ హెచ్‌పీ మోటార్లను కర్ణాటకలో అమ్మేసినట్లు నిందితులు తెలిపారు. నేరాన్ని అంగీకరించడంతో వారిని శనివారం రిమాండ్ తరలించినట్లు ఎస్ఐ విఠల్‌రెడ్డి తెలిపారు.

బండవెల్కిచర్లలో ఇద్దరు అదృశ్యం

కులకచర్ల, ఆగస్టు 24: బండవెల్కిచర్ల గ్రామంలో ఓ బాలిక, వివాహిత అదృశ్యమయ్యారు. ఏఎస్ఐ జైపాల్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన బాలిక(17) ఈనెల 21న బుధవారం రాత్రి ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. కుటుంబసభ్యులు బంధువుల దగ్గర ఆచూకీ కోసం వెతికినా ఫలితం లేకుండా పోయింది. శనివారం పీఎస్‌లో కుటుంబసభ్యులు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ తెలిపారు. బాలిక అదృశ్యంపై ముజాహిద్‌పూర్‌కు చెందిన యువకుడిపై అనుమానాలు ఉన్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు. అదేవిధంగా బండవెల్కిచర్లకు చెందిన జెట్టురి వెంకటయ్య భార్య లక్ష్మమ్మ(42) ఈ నెల 19న సోమవారం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు బంధువుల దగ్గర వెతికినా ఆచూకీ లభించకపోవడంతో శనివారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ జైపాల్‌రెడ్డి తెలిపారు.

విద్యుత్ తీగల అపహరణ

కులకచర్ల, ఆగస్టు 24: కులకచర్ల గ్రామ పరిధిలో రైతుల పొలాల దగ్గర విద్యుత్ తీగలను దొంగలు అపహరించారు. శుక్రవారం రాత్రి గ్రామ శివారులోని 20మంది రైతుల బోరు బావులకు ఉన్న విద్యుత్ తీగలను దొంగలు చోరీచేశారు. శనివారం ఉదయం బోరు మోటార్ల దగ్గరికి వెళ్లిన రైతులు గమనించారు. స్టార్టర్ నుంచి మోటార్‌కు ఉన్న తీగలను దొంగలు ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేస్తామని రైతులు తెలిపారు.

పేకాడుతున్న ఐదుగురి అరెస్ట్

యాలాల, ఆగస్టు 24: మండలంలోని అచ్యుతాపూర్ గ్రామంలో పేకాఆడుతున్న ఐదుగురు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ శంకర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. అచ్యుతాపూర్ గ్రామంలో కొంత మంది పేకాడుతున్నారన్న పక్కా సమాచారం మేరకు తమ సిబ్బందితో దాడి చేయగా గ్రామంలో ఉన్న ఒక ఇంట్లో అదే గ్రామానికి చెందిన ఐదుగురు పేకాట ఆడుతున్నారని చెప్పారు. వారిని పట్టుకొని వారి దగ్గర ఉన్న రూ.8200 సీజ్ చేసినట్లు తెలిపారు.